# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ–ఇస్రో కీలక భూమిక పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.**
2. **రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించనున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ వెల్లడించారు.**
3. **ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు.**
4. **డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లాలోని వానపల్లిలో ఈరోజు నిర్వహించనున్న గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**
5. **పని ప్రదేశాల్లో వైద్యుల భద్రతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.**

===========================

దేశ వ్యాప్తంగా ఈ రోజు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. చంద్రమండలాన్ని తాకుతూ జీవితాలను స్పృశించడం... భారత అంతరిక్ష గాథ అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత మండపంలో ఈ రోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభ ఉపన్యాసం చేశారు. దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ–ఇస్రో కీలక భూమిక పోషిస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ (20 సెకన్లు)

ఇలా ఉండగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగంలో మన దేశం సాధించిన విజయాలను ఎంతో గర్వంగా స్మరించుకుంటున్నామని తెలిపారు. అంతరిక్ష శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించే రోజు ఈరోజు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష రంగాభివృద్ధికి మరింత కృషి చేస్తుందని పేర్కొన్నారు.

---------------------------

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి

కె.పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్-3 ప్రయోగంలో విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవంపై విజయవంతంగా కాలు మోపిన సందర్భంగా ఈరోజును నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అంతరిక్ష పరిశోధనలో భాగమైన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, పరిశోధకుల కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈరోజును జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

---------------------------

తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే క్విజ్ పోటీలను కూడా నిర్వహించారు.

---------------------------

రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించనున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులోని మైసూర్ పల్లిలో ఈరోజు నిర్వహించిన గ్రామసభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలను తెలుసుకునే లక్ష్యంతో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పరంగా పంచాయితీకి ఆస్తులు ఉండాలన్నారు. గ్రామాల్లో దాతల సహాయంతో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

---------------------------

పముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమాల వేదికగా నివాళులర్పించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగిన టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ఇలా ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, కలెక్టర్లు ఆయనకు ఘనంగా నివాళులర్పించి.. ప్రకాశం పంతులు సేవలను స్మరించుకున్నారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లాలోని వానపల్లిలో ఈరోజు నిర్వహించనున్న గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. ఈరోజు మధ్యాహ్నం ఉండవల్లి నుంచి వానపల్లికి చేరుకుని అక్కడ నిర్వహించే స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామ సభలో పాల్గొంటారు. గ్రామస్థులతో సమావేశమై మరుగుదొడ్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, గ్రామాల్లో రహదారుల నిర్మాణం, వంటి అంశాలపై చర్చిస్తారు.

---------------------------

జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించడం సంతోషకరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ఈరోజు ఆయన అమరావతిలో మాట్లాడుతూ.. వైద్యుల రక్షణపై సుప్రీంకోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి హామీ లభించిందని తెలిపారు. పని ప్రదేశాల్లో వైద్యుల భద్రతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వైద్యుల సమస్యలను పరిశీలించి చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు.

---------------------------

స్వాతంత్ర్య పోరాటంలోనూ, రాష్ట్రాభివృద్ధిలోనూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోషించిన పాత్ర అజరామరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో టంగుటూరి విగ్రహానికి , ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి పూలమాలలు మంత్రి వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారని మంత్రి పేర్కొంటూ

వాయిస్ ( 21 సెకన్లు)

---------------------------

అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనలో గాయపడి, అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఈరోజు పరామర్శించారు. బాధితులతో ప్రమాదం గురించి మాట్లాడారు. అనంతరం వారికి అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

మానవాళి మనుగడ పర్యావరణ పరిక్షణతోనే సాధ్యం అవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లులతో కలిసి నిన్న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యానికి మొక్కలు నాటడమే ప్రధాన కర్తవ్యమన్నారు. తల్లిపై ఉన్న ఆప్యాయతకు గుర్తుగా ప్రతి ఒక్కరూ ఒకమొక్క నాటే కార్యక్రమాన్ని విద్యార్థులతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచనల మేరకు 2025 నాటికి దేశవ్యాప్తంగా 140 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో 'ప్రకృతి వ్యవసాయం-వాటి ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాల'పై నిన్న కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలలో సమూల మార్పులు అవసరమని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 40 శాతం మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వస్తారని, ఆ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

-------------------------

ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు పది రకాల వ్యాధి నిరోధక టీకాలు అన్నీ సచివాలయాల్లో ప్రతి బుధ, శనివారాల్లో ఇవ్వనున్నట్లు పల్నాడు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖాధి కార్యాలయంలో నిన్న వైద్యాధికారులు, పర్యవేక్షకులకు ఏర్పాటు చేసిన సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణను ప్రారంభించారు. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు నిల్వచేసే విధానం గురించి, టీకా ఇచ్చిన అనంతరం కలిగే దుష్పరిణామాలను గురించి, వాటిని ఏవిధంగా నిర్వహించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణులు, చిన్నారులు ఆరోగ్య సిబ్బంది సూచించిన విధంగా వ్యాధినిరోధక టీకాలు తీసుకొని తమ బిడ్డలను ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా రక్షించుకోవాలని సూచించారు.

======================